క్లుప్తంగా

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి : 19న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరగబోయే దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలారి యాదగిరి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టులు దేవదాస్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దీక్షాధారులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ సంఘం నాయకులు

పుల్‌కల్(అందోల్): మండలంలోని విఠల్‌నాయక్ తండాలో భవానీ మాతా సేవాలాల్ మహరాజ్ దీక్షాదారులకు విజయ్‌దశమిని పురస్కరించుకొని గిరిజన సంఘం నాయకులు ఉచితంగా దీక్షా బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాలధారులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సంఘం నాయకులు విఠల్‌నాయక్, జైపాల్‌నాయక్, బాల్‌సింగ్, పాండు, రాజేందర్ నాయక్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి



నిర్మలారెడ్డిని కలిసిన ఆర్డీఓ పాండు

సంగారెడ్డి టౌన్ : నియోజకవర్గంలోని భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీఓ పాండు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట తహసీల్దార్ జయరాం, అధికారులు పాల్గొన్నారు.

గురువులు విజ్ఞాన భాండాగారాలు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈఓ

జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిన్నారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఈఓ కుమారస్వామి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, మానవ వనరుల కేంద్ర ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజకు జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ జాబ్ కార్డుల జారీ

డీఆర్‌డీఓ ఏపీడీ బాల్‌రాజ్

న్యాల్‌కల్(జహీరాబాద్): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీఓ ఏపీడీ బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 1 ఏప్రిల్ 2024 నుంచి 31మార్చి 2025 వరకు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో రూ. 5.36 కోట్లు ఖర్చు చేసి ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు తెలిపారు. సామాజిక తనిఖీలో రూ.1.20లక్షలు రికవరీ, జరిమానా తేలిందన్నారు. ఉదయం ప్రారంభమైన సామాజిక తనిఖీలో గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన నివేదికలు సోషల్ ఆడిట్ ఆర్‌పీలు చదివి వినిపించారు. అందులో రికార్డులు సక్రమంగా లేకపోవడం, డబుల్ జాబ్ కార్డుల జారీ చేసినట్లు తేలింది. అంతే కాకుండా ఉపాధి హామీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేసినట్లు వెల్లడయింది. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్ రావు, అంబుడ్స్‌మెన్ బోజిరెడ్డి, ఎస్ఆర్‌పీ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రంగారావు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణాన్ని కప్పేసిన పొగ మంచు

జహీరాబాద్‌ను కప్పేసిన పొగమంచు

జహీరాబాద్ పట్టణాన్ని మంగళవారం పొగమంచు కప్పేసింది. సాధారణంగా శీతాకాలంలో పొగమంచు కురుస్తుంది. వర్షాకాలంలో ఉదయం పూట పొగమంచు కురవడంతో ఉ.7 గంటల వరకు పొగమంచు కారణంగా సూర్యుడు కనబడలేదు. రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. పొగమంచు వల్ల పట్టణం ఆకర్షణీయంగా కనిపించింది.

జహీరాబాద్ టౌన్:

పడకేసిన పారిశుద్ధ్యం

ఎక్కడ చూసినా చెత్తా చెదారం

- ఈగలు దోమల స్వైరవిహారం
- బ్లీచింగ్‌కు బదులు సున్నం చల్లుతున్న సిబ్బంది
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

సంగారెడ్డి : పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణను ప్రతినిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈగలు, దోమల బెడద తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కాలనీలోని వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం మురికి దర్శనమిస్తుంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇళ్ల మధ్యలో ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలు ఉండగా వాటిల్లో పెరిగిన మొక్కలు, పొదల్లో చెత్తాచెదారం పారేయడం, మురుగును వదలడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెత్త



జలాల్ బాగ్‌లో పొగైన చెత్తచెదారం

సమస్యను తీర్చి పారిశుద్ధ్య వ్యవస్థను పరచాలని కోరుతున్నారు.

అంతటా ఇదే సమస్య..

లక్ష 35వేల జనాభా, 38 వార్డులు కలిగిన సంగారెడ్డి పట్టణం వేగంగా విస్తరిస్తోంది. విద్యా, ఉద్యోగాలు, ఉపాధి పనుల నిమిత్తం వలస వచ్చిన వారు ప్లాట్లు కొనుగోలు చేయడం, కొందరు ఇళ్లు కట్టుకోగా, మిగిలిన ప్లాట్లు ఖాళీగా ఉంటున్నాయి. పట్టణ శివారులో కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో అత్యధికంగా అపరిశుభ్రం తిష్ట వేసింది.

బ్లీచింగ్ బదులు సున్నం

పారిశుద్ధ్య కార్మికులు బ్లీచింగ్ పౌడర్‌కు బదులు సున్నం వాడుతున్నారు. ఆయా కాలనీవాసులు ఇదేంటని ప్రశ్నిస్తే అసలు బ్లీచింగ్ పౌడర్ లేదని మేము బ్లీచింగ్ పౌడర్ అడిగితే సున్నం బస్తాలు ఇస్తున్నారని జవాబు చెబుతున్నారు. బ్లీచింగ్ పౌడర్ పేరుతో కొన్ని లక్షలు రూపాయలు వెచ్చిస్తున్నట్లు రికార్డులు చెప్తున్నారని ఆరోపించారు. అసలు బ్లీచింగ్ చల్లినా దాఖలాలు.. కొనుగోలు చేసిందే లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



సంగారెడ్డి పట్టణంలో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. శివారు కాలనీల్లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు, వర్షపు నీరు నిలిచి దోమల బెడద తీవ్రమైంది. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి

మిరప, బొప్పాయి తోటల సాగుపై శిక్షణ



సాగుపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం, పన్యాల గ్రామంలో రైతు విజ్ఞాన కేంద్రం సంగుపేట్ వ్యవసాయ శాస్త్రవేత్తలు మిరప, బొప్పాయి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.నిర్మల, అరుణ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ నిర్మల బొప్పాయి, మిరప సాగు గురించి రైతులకు వివరించారు. బొప్పాయి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూమి తయారీ, మార్కెట్ అవకాశాలు, చీడపీడల నివారణ గురించి వివరించారు. మిరప పంట గురించి మాట్లాడుతూ.. పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు నర్సరీ విధానంలో పెంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని మిరప పంటను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్వేత రెడ్డి, రైతులు శ్రీనివాస్ రెడ్డి, అరుణ్ కాంత్ రెడ్డి, సతీశ్, తులజారామ్, శ్రీకాంత్, నరహరి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

12 మంది జీపీఓల నియామకం

కంది(సంగారెడ్డి): కంది మండలానికి 12 మంది గ్రామ పరిపాలన అధికారులు(జీపీఓ)లు నియామకమయ్యారు. మండలంలో 22 గ్రామపంచాయతీలు, 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. విస్తీర్ణం ఆధారంగా మండలాన్ని 12 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక జీపీఓను నియమించారు. ఇప్పటివరకు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని జీపీఓలుగా నియమించడంతో మొత్తం 12 మంది విధుల్లో చేరినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గతంలో పని చేసిన వీఆర్వోలు నిర్వహించే విధులను జీపీఓలు చేపడతారని పేర్కొన్నారు.

గండ్లు పూడ్చాలని ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారాయి. జిన్నారం పట్టణ పరిధిలోని ఊట్ల పెద్ద చెరువుకు భారీగా వరదనీరు చేరడంతో గండి పడింది. దీంతో స్థానికులు, మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తూ మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతికి ఫిర్యాదు చేశారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పరిధిలోని ఎర్రచెరువు భారీ వర్షాలకు వరద నీరు చేరింది. దీంతో చెరువుకు గండి పడింది. స్థానికుల ఆందోళన చెందుతూ నీటి పారుదల శాఖ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేశారు. పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణ సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి : పేరుకే 100 రోజుల ప్రణాళిక అని, అమలుకు నోచుకోని లేదని పట్టణంలోని పలు వార్డుల్లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని సీపీఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి ఆరోపించారు. మంగళవారం పార్టీ సంగారెడ్డి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలోని 11వ వార్డులో సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారన్నారు. వర్షం పడితే రోడ్లు లేక వీధిలైట్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వందరోజుల ప్రణాళికను తూతూమంత్రంగా నిర్వహించారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కమిటీ సభ్యులు బాలరాజు, నాయకులు శివశంకర్, పాండు, శంకర్, రాకేష్ రాములు, రాజ్ కుమార్, బాలరాజు, దుర్గయ్య, ఎలీషా, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఆఫీసుఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భారీ వర్షం.. పొంగిపొర్లుతున్న వాగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి వాగు

మండలంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లో నీరు చేరింది. రేజింతల్ సమీపంలో గల మామిడివాగు పొంగి పొర్లడంతో రేజింతల్ నుంచి ఝరాసంగం మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట పొలాల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరడంతో పంటలు దెబ్బన్నాయి. న్యాల్‌కల్(జహీరాబాద్):

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: మండల కేంద్రం మనూరుకు చెందిన మురళీకి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సు మేరకు ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.60 వేలు మంజూరయ్యాయి. మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.గిరిజా షెట్కార్ చెక్కును అందజేశారు.

◆ **ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ముస్లిం స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి మంగళవారం కార్పొరేటర్ బి.పుష్ప శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు స్మశాన వాటిక ప్రహరీ కూలిపోయింది. అందులో భాగంగా నూతన గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

◆ **ఘనంగా హిందీ భాషా దినోత్సవం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన రచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం హిందీ సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయులకు విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

◆ **గిరిజన తండాల్లో ఆధ్యాత్మిక సందడి**

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బంజారాలు ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహరాజ్ నామ స్మరణ చేస్తుంటారు. విజయదశమి పురస్కరించుకుని 11 రోజుల పాటు జగదాంబ మాత, సేవాలాల్ దీక్షలు చేపడుతారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సేడిగుట్ట తండాలో పూజారి రవిరాథోడ్ వంద మందికి మాలధారణ చేయించారు.

◆ **రక్తదానం ప్రాణదానంతో సమానం**

నారాయణఖేడ్: ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానంగా మారుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో మంగళవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ, ఖేడ్ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది రక్తదానం చేశారు.

◆ **నేడు జెండావిష్కరణ**

మునిపల్లి(అందోల్): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం జాతీయ జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గంగాభవాని మంగళవారం తెలిపారు. ఉ.10 గంటలకు జెండావిష్కరణ కార్యక్రమం ఉంటుందని ప్రజలందరూ హాజరు కావాలని కోరారు.

◆ **పశు వైద్య శిబిరాలతో లబ్ధి**

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారులు సంధ్యారాణి ,హేమలతలు అన్నారు. మంగళవారం హత్నూర మండలం ఎల్లమ్మ గూడాలో ఏషియన్ పెయింట్ వారి సహకారంతో దన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారులు సంధ్యారాణి ,హేమలతలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.



విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమి పరిరక్షణకు సూర్యకిరణాల నుంచి రక్షించేది ఓజోన్ పొర అని తెలిపారు. పట్టణీకరణ వల్ల పరిశ్రమలు పెరిగి జలకాలుష్యం, వాయుకాలుష్యం వల్ల క్రమంగా ఓజోన్‌కు రంధ్రాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఇదే భవిష్యత్తులో జరిగితే సూర్యుడు అతినీల లోహిత కిరణాల ప్రభావం భూమిపై పడి క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమవుతుందన్నారు. ఓజోన్ పొర, దానికి సంబంధించిన అంశాలపై విద్యార్థులకు పీపీటీ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు డాక్టర్ వల్లి సౌభాగ్యం, డాక్టర్ వాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

భూమిని రక్షించుకుందాం

పటాన్‌చెరు: ఓజోన్ పొరను కాపాడుకోవడం, భూమిని రక్షించుకోవడంపై మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఓజోన్ క్షీణించే పదార్థాలను (ఓడీఎస్) దశలవారీగా తొలగించడం, హానికరమైన అతినీలలోహిత యూవీ కిరణం నుంచి భూమిని రక్షించడం లక్ష్యంగా జరిగిన అంతర్జాతీయ ఒప్పందం– మాంట్రియల్ ప్రోటోకాల్ (1987) వార్షికోత్సవాన్ని పునఃశ్చరణ చేసుకున్నారు. రుద్రారంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గొడుగులతో విద్యార్థుల ర్యాలీ

సంగారెడ్డి : ఓజోన్ పొర ప్రాముఖ్యత గురించి పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ చౌటకూరు మండలం శివంపేటలో నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ, ఉపాధ్యాయులు అబ్దుల్ ఖదీర్, శ్రీదేవి, రాములు, మజీద్ ఉన్నారు.

రికార్డుల నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రాజశేఖర్

హత్నూర(సంగారెడ్డి): మహిళా సంఘాల రికార్డుల నిర్వహణపై వీఓఏలు అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం రాజశేఖర్ అన్నారు. మంగళవారం హత్నూర మండల ఐకేపీ కార్యాలయంలో వీఓఏలకు రికార్డుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి నెల నిర్వహించే సమావేశాలకు తప్పకుండా వీఓఏలు హాజరై సంఘం యొక్క సమస్యలను తెలుసుకుని రికార్డుల్లో పొందుపరచాలన్నారు. మహిళలు తీసుకున్న రుణాలకు వడ్డీతో సహా చెల్లించేలా మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు. కొత్తగా కిషోర్ బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో అన్ని గ్రూపులకు సంబంధించిన లావాదేవీలు తప్పకుండా నమోదు చేయాలని వీఓఏలకు సూచించారు. కార్యక్రమంలో సీసీలు కిష్టయ్య, మహేశ్, సునీత, నాగరాణి, సావిత్రి ,రేణుక, వీఓఏలు పాల్గొన్నారు.

వరిసాగులో యూరియా తగ్గించాలి

కల్హేర్(నారాయణఖేడ్): వరిసాగులో యూరియా వాడకం తగ్గించాలని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కృష్ణాపూర్‌లో వరి పంట పొలాలు పరిశీలించారు. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దని సూచించారు. 4 దఫాలుగా యూరియా వాడాలని వేసినప్పుడు 25 కేజీలు మాత్రమే వేయాలన్నారు. అధికంగా యూరియా వేస్తే తెగుళ్ల వస్తాయని వివరించారు. వరిపొట్ట దశలో ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ఎరువుల ధరలు అధికంగా ఉండటం వల్ల పెట్టుబడి తగ్గించుకునేందుకు మార్కెట్లో నానో డీఏపీ నానో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఏఈఓ కృష్ణవేణిపాల్గొన్నారు.



కల్హేర్: పంటను పరిశీలిస్తున్న నూతన్‌కుమార్ తదితరులు

సాయుధ పోరాటంపై దుష్ట రాజకీయం



మాట్లాడుతున్న తుకారాంనాయక్

నారాయణఖేడ్: తెలంగాణ సాయుధ పోరాటంపై బీజేపీ దుష్ట రాజకీయం చేస్తోందని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తుకారాం నాయక్ విమర్శించారు. మంగళవారం ఖేడ్‌లో తెలంగాణ సాయుధ పోరాటాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు తొత్తులుగా ఉన్న పటేల్, పట్వారీ, జమిందారులను తతరిమికొట్టిన కమ్యునిస్టులు పోరాటంలో 4 వేల మంది యువకిషోరాల ప్రాణాలు బలిదానం చేశారన్నారు. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టిన ఘనత కమ్యునిస్టులదన్నారు. పార్టీ జిల్లా, స్థానిక నాయకులు తెంకటికుమార్, రాజు, రవి, ప్రమోద్, పాపయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్ల జోలికి వస్తే సహించం

లంబాడి ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జి అశోక్ నాయక్

సంగారెడ్డి : బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొంతమంది ఆదివాసీ నాయకులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం సరికాదని మంగళవారం సంగారెడ్డి జిల్లా లంబాడి ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జి అశోక్ నాయక్ ఓ ప్రకటనలో తప్పుబట్టారు. ఆదివాసీ నాయకులు స్వలాభం కోసం గిరిజనుల మధ్య తగాదాలు పెట్టొద్దని సూచించారు. బంజారా నాయకుల మీద చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలన్నారు. బంజారాలు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని కోరారు.

బకాయిల ప్రభుత్వం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో ఉన్నది ఇందిరమ్మ ప్రభుత్వం కాదని, బకాయిల ప్రభుత్వమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజుల బకాయిల కోసం విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తుంటే మరో పక్క ఆరోగ్యశ్రీ బిల్లుల బకాయిల కోసం ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు ఇవి ఉదాహరణ అని తెలిపారు. ప్రభుత్వం వెంటనే విద్యా సంస్థలకు, ఆసుపత్రిలకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

సేవాపక్షంలో రక్తదానం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ కేంద్రంలో బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సేవా పక్షం వర్క్‌షాపును నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు సేవపక్షంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రక్తదానం చేశారు. రక్తదాతలను గోదావరి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. సేవాపక్షంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.